క్లుప్తంగా

తపోవనంలో శివరాత్రి మహోత్సవాలు



తపోవనంలో పూజలు చేస్తున్న పీఠాధిపతి, వేద పండితులు

తుని రూరల్: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో మహా శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వేద పండితులు వేదోక్త చతుర్యామ మహాపూజ, చతుర్వేద పారాయణ నిర్వహించారు. ఈ నెల 8న మహా శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మహాస్వామి తెలిపారు. అప్పటి వరకూ రోజూ ఆశ్రమంలో శివునికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. శివరాత్రి పర్వదినాన్ని హిందువులంతా ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

ఇంటర్ పరీక్షలకు 10 మంది గైర్హాజరు

కిర్లంపూడి: స్థానిక ప్రభుత్వ, ప్రగతి ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో మంగళవారం జరిగిన ఇంటర్మీడియెట్ సెకండియర్ ఇంగ్లిషు పరీక్షకు పది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వాహక చీఫ్ సూపరింటెండెంట్‌లు కల్యాణ్ కుమార్, కె.ఉషామాధురి అన్నారు. రెండు పరీక్ష కేంద్రాల్లో 671 మందికి 661 మంది విద్యార్థులు హాజరయ్యారు.

కొత్త కార్యవర్గం ఎన్నిక

ఏలేశ్వరం: స్థానికంగా జిల్లా ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. పట్టణ నవయుగ పవర్ ఎలక్ట్రికల్ ప్లంబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా ఆర్‌వీ కృష్ణకుమార్, అధ్యక్షుడిగా జేఎస్‌కే శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్వీ రాజు, కార్యదర్శిగా సీహెచ్ సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా కె.చిన్ని, కోశాధికారిగా గణేష్‌లను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీహరిరావు మాట్లాడుతూ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్‌ను ఆదుకోవాలన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

తుని: స్థానిక నాగరాజుపేట రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. మంగళవారం జరిగిన సంఘటనకు సంబంధించి ఆయన కథనం ప్రకారం.. పాయకరావుపేట లింగాల కాలనీ వద్ద పట్టాలు దాటుతున్న 60 ఏళ్ల వ్యక్తిని తుని నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తెలుపు రంగు ఆఫ్ చేతుల చొక్కా, నీలం రంగు గడుల లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జారిపడి మరొకరు..

టి.తిమ్మాపురం వద్ద రైలు నుంచి జారిపడి జార్ఖాండ్‌కు చెందిన వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. మంగళవారం తిమ్మాపురం వద్ద రైలు పట్టాల పక్కన కొనఊపిరితో ఉన్న 40 ఏళ్ల వ్యక్తిని 108 అంబులెన్స్‌లో తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడి వద్ద లభించిన ఆధారం ప్రకారం చక్కరధరపురం (జార్ఖాండ్)కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల

ఏలేశ్వరం: ఏలేరు జలాశయం నుంచి దిగువకు నీటి విడుదలను పెంచారు. వేసవి ప్రారంభం కావడంతో మంగళవారం దిగువ ఆయకట్టుకు వెయ్యి క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రాజెక్టులో ఎగువ ప్రాంతం నుంచి నీటి సరఫరా అంతంత మాత్రంగా ఉండడంతో నిల్వలు తగ్గుతున్నాయి. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని అధికారులు నీటి సరఫరా చేస్తున్నారు. దీంతో దిగువ విశాఖకు 150, తిమ్మరాజు చెరువుకు 50, పంపాకు 40 క్యూసెక్కుల నీటి విడుదల చేశారు.

బహుజనులు రాజ్యాధికారం చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

తుని రూరల్: రాష్ట్రంలో బహుజనులు రాజ్యాధికారం చేపట్టాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి అన్నారు. మంగళవారం హంసవరంలో బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి తంతటి కిరణ్ కుమార్ అధ్యక్షతన నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పరంజ్యోతి పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ముందడుగు వేస్తేనే రాజ్యాధికారం దక్కుతుందన్నారు. తుని నియోజకవర్గం నుంచి బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కిరణ్‌కుమార్‌ను ఆశీర్వదించాలన్నారు. మూడు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుపరిపాలనతో సువర్ణాధ్యాయం

- సీఎం జగన్‌తోనే పేదల సంక్షేమం
- పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- ప్రత్తిపాడులో అట్టహాసంగా 'సిద్ధం' సభ



సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/ ఏలేశ్వరం: కలలోనూ ఊహించని సంక్షేమం.. ఇంటికే వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనతో సువర్ణాధ్యాయం లిఖించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ అన్నారు. ప్రత్తిపాడులో వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సిద్ధం సభ అట్టహాసంగా జరిగింది. దీనికి నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల నుంచి భారీ ఎత్తున ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. దీంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి, దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సామాజిక పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచిందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. వలంటీర్ వ్యవస్థతో పేదల ఇంటికే నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజా ధనాన్ని దోచుకు తిన్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరిగిందని, సంక్షేమ పథకాలు అర్హులకు అందాయన్నారు. పార్టీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు తలెత్తుకు తిరిగేలా పార్టీ అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ అధ్యక్షుడు జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో టీడీపీ హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తే, తమ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. పార్టీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్, వరుపుల సుబ్బారావులను పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. ఎంపీపీలు గోళ్ల కాంతి సుధాకర్, పర్వత రాజబాబు, జెడ్పీటీసీ సభ్యులు బెహరా రాజరాజేశ్వరి, గొల్ల చిన దివాణం, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు వాసిరెడ్డి జమీలు, వరుపుల సూరిబాబు, జల్లిగంపల ప్రభాకరరావు, పర్వత వివేక్‌లతో పాటు నాలుగు మండలాల పార్టీ కన్వీనర్లు, జేసీఎస్ మండల కన్వీనర్లు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం

తొలుత పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్‌లకు పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. సభకు నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన 25 వేల మందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా తీన్‌మార్ వాయిద్యాలు, తప్పెటగుళ్లు, కొమ్ము డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, ప్రత్తిపాడు, అన్నవరం, ఏలేశ్వరం ఎస్సైలు పవన్‌కుమార్, సతీష్, కిశోర్ బందోబస్తు నిర్వహించారు.

తరలివచ్చిన శ్రేణులు

శంఖవరం: ప్రత్తిపాడులో జరిగిన నియోజకవర్గ స్థాయి సిద్ధం సభకు శంఖవరం మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. ఈ వాహనాలను ఎంపీపీ పర్వత రాజబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రాజబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సిద్ధం సభలు జన సునామీని తలపిస్తున్నాయన్నారు. సర్పంచులు ఈగల విజయ్‌దుర్గ, సకురు గుర్రాజు, పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, నాయకులు గింజాల కొండబాబు, యడ్ల సత్యనారాయణ, కోన బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జక్కంపూడి గణేష్



శంఖవరంలో జెండా ఊపి సిద్ధం సభ వాహనాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ పర్వత రాజబాబు



కొమ్ము డ్యాన్స్ చేస్తున్న కళాకారులు

తోట నరసింహానికి మద్దతుగా బైక్ ర్యాలీ



వీరవరంలో తోట నరసింహాన్ని కలసిన బండారు రాజా

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం నాయకత్వంలో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జగ్గంపేట మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం సుమారు 500 మంది వైఎస్సార్ సీపీ అభిమానులు బైక్ ర్యాలీగా వీరవరం చేరుకుని తోట నరసింహానికి మద్దతు తెలిపారు. తోట నరసింహం, పార్టీ యువ నాయకుడు తోట రాంజీ ప్రతి కార్యకర్తను పేరుపేరునా పలకరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో నరసింహంను అధిక మెజార్టీతో గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ఇన్‌చార్జి తోట బాబ్జీ, జోకా శ్రీను, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

లక్కీ డ్రా విజేతకు బైక్

తుని: భారత్ పెట్రోలియం సంస్థ తుని బంకులో క్రిస్మస్, న్యూ ఇయర్ సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతకు బైక్‌ను మంగళవారం అందజేశారు. ప్రకాశం రోడ్డులోని చెక్కా శ్రీరామ్మూర్తి బంకులో తీసిన డ్రాలో తుని రామకృష్ణ కాలనీకి చెందిన ఎం.శ్రీనుకు హీరో హోండా షైన్ బైక్‌ను గెలుచుకున్నాడు. దీనిని బంకు యాజమాని చెక్కా తాతాబాబు, భారత్ పెట్రోలియం సీనియర్ మేనేజరు సంజీవ్ కుమార్, సిటీ కేబుల్ ఎండీ బోడిశెట్టి త్రిమూర్తిస్వామి అందజేశారు.

వైఎస్సార్ సీపీతో రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు

- పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం



గెద్దనాపల్లి సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

కిర్లంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు వచ్చిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. గెద్దనాపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడు బొడ్డేటి గోవింద ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తోట నరసింహం హాజరై పేరుపేరునా అందరినీ పలకరించారు. గెద్దనాపల్లిలో గతంలో చేసిన పలు అభివృద్ధి పనులను గుర్తు చేశారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ అన్ని వర్గాలకు మేలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. నాయకుడు తోట రాంజీ, మండల పార్టీ ఇన్‌చార్జి తోట బాబ్జీ, ఎంపీటీసీ బొడ్డేటి నాగలక్ష్మి, కాళ్ల బాబూరావు, బర్రే రఘు, కట్టు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు పెనగంటి రాజేష్, తోట విష్ణు, పలికల గంగరాజు, మొల్లేటి గంగాధర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి



తంటికొండ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సిద్ధం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

గోకవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ నాయకుడు సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు అన్నారు. తంటికొండలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని మంగళవారం వారు ప్రారంభించారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బద్దిరెడ్డి అంజిబాబు, ఉపాధ్యక్షుడిగా మాదాసు సత్యసురేషలను నియమించారు. అనంతరం సిద్ధం పోస్టర్లు ఆవిష్కరించి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహంను, సీఎంగా జగన్మోహన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు (రెడ్డి), నాయకులు బద్దిరెడ్డి అప్పన్నదొర, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బద్దిరెడ్డి నాగవెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, బద్దిరెడ్డి సుబ్బారాయుడు, కిలాడి అప్పారావు, కొవ్వాడ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో రికార్డుల పరిశీలన



తొండంగి భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

తొండంగి: స్థానిక భవిత కేంద్రాన్ని జిల్లా సమగ్ర శిక్ష ఐఈ కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. అక్కడ విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. విద్యార్థుల హాజరు, లెర్నింగ్ యాక్టివిటీస్ తదితర రికార్డులను పరిశీలించి ఐఈఆర్టీ కోఆర్డినేటర్లకు సూచనలు చేశారు. మండల విద్యాశాఖాధికారులు, ఐఈఆర్టీ వలంటీర్లు ఉన్నారు.

డిజిటల్ పరిజ్ఞానం పెంపొందించాలి

తుని రూరల్: ప్రత్యేకావసరాల పిల్లలకు మెలకువలతో డిజిటల్ పరిజ్ఞానం పెంపొందించాలని జిల్లా సమగ్ర శిక్ష ఐఈ కో ఆర్డినేటర్, సీఎంఓ చామంతి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన తుని భవిత కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల హాజరు, అడ్మిషన్ రికార్డులు, అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. పిల్లల్లో నైపుణ్యాన్ని ప్రత్యేక్షంగా చూశారు. పిల్లల ఆరోగ్య, మానసిక పరివర్తనను గమనించాలని సిబ్బందికి సూచించారు. మండల విద్యాశాఖ అధికారి ఎ.రామకృష్ణ, ఐఈఆర్‌పీలు శ్రీనివాస్, రాంబాబు పాల్గొన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

గోకవరం: రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గోకవరం ఎంఈఓ బి.గౌరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనాథలు, హెచ్‌ఐవీ బాధిత, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం కోటా కింద ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దీనికి ఈ నెల 25 వరకూ గడువు ఉందని, అర్హత ఉన్న విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 18004258599కు ఫోన్ చేయాలన్నారు.

రైతు ఇంట పంటగలా..



తొండంగి మండలంలో మిచాంగ్ తుపానుకు దెబ్బతిన్న పంటను పరిశీలించిన అధికారులు (ఫైల్)

- నష్టపోయిన రైతన్నలకు బాసట
- నేడు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల
- తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో రూ.8.51 కోట్ల సాయం

తొండంగి: విత్తు నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకూ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోంది.. అన్ని దశల్లోనూ కొండంత భరోసా అందిస్తోంది.. గత ప్రభుత్వంలో ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలకు సాయం అందించాలంటే గగనమయ్యేది. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో అండగా నిలుస్తోంది. గతేడాది డిసెంబర్‌లో మిచాంగ్ తుపానుకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తుంది. మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాలతో తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో పంట నష్ట అంచనా వేగంగా జరిగింది. పంట నష్టపోయిన 11,782 మంది రైతులకు ఈ–క్రాఫ్ బుకింగ్ ఆధారంగా ఇన్‌పుట్ రాయితీని ప్రభుత్వం బుధవారం అందించనుంది. గతేడాది డిసెంబర్ 3న మిచాంగ్ తుపానుతో జిల్లాలోనే అత్యధికంగా తొండంగి మండలంలో 2,022 హెక్టార్లలో వరి పంట నీట మునిగింది. తుని మండలంలో 330 హెక్టార్లు, కోటనందూరు మండలంలో 827 హెక్టార్లు కలిపి 7,858 మంది బాధిత రైతులను గుర్తించారు. వీరికి రూ.5.40 కోట్లు అందించనున్నారు. అలాగే ప్రత్తిపాడు మండలంలో 978 హెక్టార్లు, ఏలేశ్వరం మండలంలో 492, రౌతులపూడిలో 216, శంఖవరం మండలంలో 147 హెక్టార్లలో 4,224 మంది రైతులను గుర్తించారు. వీరికి రూ.3.11 కోట్లు అందించనుంది. తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో మొత్తంగా 5,060 హెక్టార్ల విస్తీర్ణంలో వరి పంట దెబ్బతిందని ఏడీఏ సుంకర బుల్లిబాబు తెలిపారు. గతంలో పంట నష్టం అంచనా వేసేందుకు సిబ్బంది లేక నెలల తరబడి నష్టం అంచనా ప్రక్రియ నిర్వహించేవారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి గ్రామంలో క్షేత్ర స్థాయిలో గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రెవెన్యూ సిబ్బంది సహకారంతో పంట నష్టం అంచనా వేసి అతి తక్కువ రోజుల్లోనే పరిహారం వచ్చేలా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హెక్టారుకు రూ.15 వేల చొప్పున పంట నష్టాన్ని ఇన్‌పుట్ రాయితీగా 11,782 మంది రైతులకు డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతి ద్వారా రూ.8.51 కోట్లు అందించనుందని తొండంగి మండల వ్యవసాయ అధికారి ఎస్.నరసింహం తెలిపారు. తమకు జగనన్న ప్రభుత్వం బాసటగా నిలిచిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వమే ఆదుకుంటోంది



నేను 1.80 ఎకరాల్లో వరి పంట వేశాను. డిసెంబర్‌లో వచ్చిన మిచాంగ్ తుపానుకు దెబ్బతింది. ఎన్నో ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నాను. గతంలో ఏ ప్రభుత్వాలూ పంట నష్టపోతే ఇంత త్వరగా స్పందించిన దాఖలాలు లేవు. ఒక్క జగనన్న ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకుంటుంది. ఇన్‌పుట్ రాయితీ అందించడం సంతోషంగా ఉంది.

– పసుపులేటి నాగరాజు, రైతు, పి.ఇ.చిన్నాయపాలెం

త్వరితగతిన నష్టం అంచనా



గతంలో మండల స్థాయిలో మాత్రమే వ్యవసాయ అధికారులు, సిబ్బంది పనిచేసేవారు. ఇప్పుడు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా ఏటా ఈ–క్రాఫ్ ఆన్‌లైన్ నమోదు చేస్తున్నాం. పంట నష్టం సంభవిస్తే త్వరితగతిన నష్టాన్ని అంచనా వేయగలుగుతున్నాం. జిల్లాలో అత్యధికంగా తొండంగి మండలంలో 2022 హెక్టార్లలో పంట దెబ్బతింది.

– ఎస్.నరసింహం, వ్యవసాయ అధికారి, తొండంగి మండలం

మహిళల ఆర్థిక స్వావలంబనకు ఆసరా



తునిలో డ్వాక్రా సంఘాలకు ఆసరా నమూనా చెక్కును అందిస్తున్న సీపీ సుధారాణి

తుని: మహిళల ఆర్థిక స్వావలంబనకు ఆసరా పథకం దోహదపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మంగళవారం స్థానిక బ్యాంకు కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం కమిషనర్ వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ సుధారాణి రూ. 1.70 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేసిందన్నారు. 11 నుంచి 20వ వార్డుల్లో 218 సంఘాలకు నాలుగు విడతల్లో రూ.6.83 కోట్లు ఆసరా ద్వారా అందించిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణ శాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజు, మెప్మా అధికారిణి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం



కనకదుర్గమ్మ వారికి చండీ హోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువు దీరిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారి మూల నక్షత్రం సందర్భంగా మంగళవారం చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చండీ హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. తరువాత భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. చండీ హోమం, పూజ కార్యక్రమాలను వేదపండితులు సంతోష్ ఘనాపాఠీ, గంగాధరభట్ల శర్మ, ఉప ప్రధానార్చకుడు ఇంద్రగంటి వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకుడు కంచిభట్ల సాయిరామ్, వ్రత పురోహితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు నిర్వహించారు.

నేడు విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం



ప్రత్తిపాడులో ముస్తాబైన విశ్వేశ్వరస్వామి ఆలయం

ప్రత్తిపాడు: స్థానిక అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి వారి పంచాయతన ఆలయంలో బుధవారం నుంచి ఆరు రోజుల పాటు కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ కల్యాణ వేదికను సిద్ధం చేసింది. బుధవారం ఉదయం స్వామి అమ్మవార్లను నూతన వధూవరులుగా ముస్తాబు చేస్తారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తారు. 7న రాత్రి భజనా కార్యక్రమం, 8న రాత్రి మహా శివరాత్రిని పురస్కరించుకుని లింగోద్భకాల అభిషేకాలు, 9న మధ్యాహ్నం అన్న సమారాధన, 10న ఉదయం త్రిశూల స్నానం, రాత్రి భజనలు, 11న రాత్రి శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

గంగమ్మ తల్లికి పూజలు



రాజపూడి గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: మండలంలోని రాజపూడి గ్రామంలో యాదవుల ఆధ్వర్యంలో మంగళవారం గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. గంగమ్మ తల్లిని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సీపీ నేతలు ఇళ్ల అప్పారావు కాపు, ఉయ్యూరి నాని, సర్పంచ్ బూసాల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే అసోసియేషన్ డివిజినల్ మేనేజర్ రాంగోపాల్

తుని: రైల్వే పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్థానిక అసోసియేషన్ డిమాండ్ చేసింది. స్థానిక రైల్వే కల్యాణ మండపంలో మంగళవారం రైల్వే పెన్షనర్ల తుని బ్రాంచ్ అధ్యక్షుడు జి.రమేష్ బాబు అధ్యక్షతన అసోసియేషన్ 15వ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ డివిజినల్ మేనేజర్ రాంగోపాల్ మాట్లాడుతూ పెన్షనర్ల మెడికల్ అలవెన్స్ రూ. వెయ్యి నుంచి రూ. 3 వేలకు పెంచాలని, పెన్షనర్ల కమ్యుటేషన్ రికవరీ పిరియడ్‌ను 15 నుంచి 12 ఏళ్లకు తగ్గించాలని, పెన్షనర్లను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని అన్నారు. అనంతరం 75 ఏళ్లు దాటిన పెన్షనర్లను సన్మానించారు. జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారావు, డివిజినల్ కార్యదర్శి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.